# నన్ను నమ్మవూ!

రచన:
కుమారి ఎస్. వి. భానుమతి

సాయంకాలం అయిదుగంటలయింది. ఆఫీసు వర్కు కట్టిపెట్టి, ఉసూరుకుంటూ కార్పొరేషను ఆఫీసుబిల్డింగ్సునుండి బైటపడింది. స్టెనోటైపిస్టు పార్వతి. గేటునద్దనిలుచుని, పోతున్న రిక్షాను ఆపి అందులోకూర్చుంది. ఆమె ఆవేదన వదనంపసికట్టిన రిక్షావాలా తనరిక్షాను మరింత వేగంగాతొక్కడం ప్రారంభించాడు.

మున్సిపాలిటీ కార్పొరేషను ఆఫీసులో గత రెండేళ్ళనుండి స్టెనోటైపిస్టుగా పనిచేస్తోంది పార్వతి. అయినవారందరినీ విడచి, ఒంటరిగా జీవనయాత్రసాగిస్తోంది పార్వతి. ఆమెవ్యక్తిత్వం దెబ్బతినకుండా, ఆఫీసులో నలుగురిలోనూ, మంచిగావుంటూ, అందరితోచే 'మంచి' అని అనిపించుకుంది పార్వతి. పార్వతినీ, ఆమె చరిత్రనూ, ఎరుగనివారు ఆ కార్పొరేషను ఆఫీసులోలేరనుట అతిశయోక్తికాదు. కానీ, ఆమెను చూడగానే, ఈర్ష్యకుబదులు ఆమెపై ఒకవిధమయిన జాలీ, సానుభూతి, చూపిస్తారు. తోటిగుమస్తాలు.

'ఈమె తనజీవితంలో గతించిపోయినగాధతో, ఆమె మనసు ముక్కలైంది. ఊహింపరాని ఒక చిన్నపొరపాటుమూలంగా, ఆమె తన జీవితాన్ని తానే చేతులారా నాశనంచేసుకుంది. తన హృదయేశ్వరుని ఎడబాటుకు,ఆమె మనసు తీరనిదుఃఖంతో, ఆ వేధనతో అలమటించి పోతోంది. కానీ, జరగిపోయినతరువాత ఫలితం ఏముంది.?

'జీవితమంతా, ఆమె యిలానే వేధనతో, శోధించి, కృశించి, నశించిపోవడంతప్ప, మరో కదారి ఏదీ కనిపించలెదు పార్వతికి.

అమ్మగారూ!. అన్న రిక్షావానిపిలుపుతో ఆమె ఆలోచనాస్రవంతులు ఆగిపోయాయి.రిక్షా దిగి, వాడికి డబ్బులుయిచ్చి, తలుపుతాళం తీసుకుని, లోపలకి వెళ్ళింది. ఉసూరమని నిట్టూరుస్తూ పార్వతిచేతిలోవున్న కాగితాలు కట్ట పట్టెమంచంపై గిరవాటువేసి భారంగా మంచంపై చతికిలపడింది పార్వతి. కాగితాలు అలా విసురుగావిసరడంతో వాటిమధ్యనుండు ఒకవరు ఎగిరి దూరంగాపడింది.

పార్వతి ఆశ్చర్యంతో ఆకవరుతీసి చూసింది. ఫ్రం అడ్రసు లేదు. ఎందుకు, ఆమె ఆ వుత్తరం గందుకోగానే ఆమె ఎడమకన్ను భయంకరం వేగంగా కొట్టుకోసాగాయి.

'ప్రియమైన పారూ!.

ఆ సంభోధనతో ఉలిక్కిపడింది పార్వతి. ఆ సంబోధనవినడంతోనే ఆమెకళ్ళలో కన్నీరు కట్టలుత్రెంచుకుని ప్రవహించ సాగింది.

అవును మరి! ఆ ప్రియమైన సంబోధనతనకు స్కూలులో చదువుచున్నప్పటినుండి పరిచయమైనదే కాలక్రమేణా, ఈర్ష్య అసూయలకు లోనై, తనజీవితం ఉద్దరించవలసిన, తన ప్రియుడు, ఆత్మబంధువు అయిన అతన్ని తన దురదృష్టంవలన, తనచేతులారా,తనను ఎంతో అప్యాయంగా పారూ! అని మనస్ఫూర్తిగా, అందరికన్న ఎక్కువగాప్రేమించి, పూజించిన అతనిని, దురదృష్టంవలన తనే జారవిడచుకున్నది. గతంనాస్తి!. అనురాగమూ, అవకాశమూ, తనుదూరంచేసుకుని, యిప్పుడు యిన్నే

ళ్లా జీవచ్ఛవంలా బ్రతుకుతోంది. గతం ఆమె మనసులో మెదిలి, చేసుకున్న పాపానికి ఫలితంగా ఆమె కళ్ళనుండి అశ్రువులు ధారాపాతంగా కురుస్తోన్నాయి.

'ఆమె బలవంతంగా కంటినీరునిఆపుకుంటూ, వుత్తరంపై దృష్టిమరల్చింది, షారూ!. నే నెవరో జ్ఞాపకం వున్నానా, లేక నన్ను మరచే పోయావుకదూ!! ఆమెగుండెలు పిండినట్లయింది. అవును. అతను తనకుగుర్తుకు లేకపోవడమా? అతన్ని మరచిపోవడమా!! అది కలలో కూడ జరగదు. చేసినపొరపాటు ఏదో దురదృష్టం వలనచేసింది తను. తన జీవితంలో పన్నీటి జల్లులు చిలకరించి, తనజీవితాన్ని ఆనందమయంచేయడానికి, తనశక్తినంతనూ వినియోగించడానికి సహృదయంతో పూనుకున్న, ఆపుణ్యమూర్తిని ఎలామరచి పోగలదు తను.




గతించిపోయినగాధ ఆమె మనసుకు వాడిములుకుల్లా తగిలి ఆమెనుబాధించసాగింది. ఆమె బలవంతంగా చూపును మరల్చుకుని, చదవసాగింది. చదువుతోంటే. ఆమెకు ఎంతో ఏడుపు వస్తోంది.

ఇదంతా తనే చేతులారా చేసుకుంది, తనను ప్రేమతోలాలించి; బుజ్జగించేవారు లేకుండా నిర్ధయగా, అతన్ని. తననుంచి దూరంచేసుకుంది. తనకోసం, తనజీవితంకోసం, ప్రేమించి, తపించిపోయే అతన్ని పౌరుషంగామాట్లాడి. అతని సున్నితమైన మనసునునొప్పించి, గాయపరచింది. అతనిని, తన హృదయంనుండి దూరం చేసుకుంది. తనెంతపాపిష్టిది. తీరని దుఃఖంతో ఆమెగొంతుక పూడుకుపోయింది. ఆ వేదన తెరలు తెరలుగా, ఆమెగుండెలలోంచి బైటకు వస్తోంది. అతన్ని దూరంచేసుకుని, చదువుకున్నాననీ అహంకారంతో, దిక్కులేని పక్షిలా, యిన్నేళ్ళూ, తోడు, నీడలేని తనబ్రతుకుని, నెట్టుకువస్తోంది. తనుచేసినపొరపాటు ఒక్కటే, తనజీవితం, తనే నాశనంచేసుకుంది. అది తను చేతులారా ఆవేశంలో చేసినపొరపాటు. ఆనాటిరాత్రి, అతనికి, తనను మనసారాప్రేమించి, పూజించుకుంటున్న అతనికి, ఏదో అన్నందుకు ఆవేశంలో నువ్వునన్ను, మోసంచేసావని, ఇక తనను మరచిపొమ్మని ఆనాడు అతనికి వుత్తరంరాసింది. తనే చేతులారా ఆపుణ్యమూర్తి మనసుకువిరచివేసింది. తననుంచిదూరం చేసుకుంది. ఆ తర్వాతగానీ, తను ఎంతఘో

రంగా ప్రవర్తించిందో తెలిసివచ్చింది. అయిపోయింది. ఆనాటీతో అంతా అయిపోయింది. తనజీవితం, ఆనాటిసంఘటనతో నాశనం అయిపోయింది. ఇంతజరిగినతర్వాత యిప్పుడు ఏడిచ్చి, ఏంప్రయోజనం. ఇక ఆపుణ్యామూర్తి తనజీవితంలోకి తొంగిచూడడు.

తెరలుతెరలుగా వస్తున్న గతించిపోయిన జ్ఞాపకాలను బలవంతంగా ఆపుకుని వుత్తరం వైపుచూపు మరల్చి, వస్తున్నకన్నీటిని ఆపుకుంటూ చదవసాగింది పార్వతి.

'అవునుపారూ! నీవు మరచిపోయినా మరచిపోతావు. ఇంతకాలానికి, ఇపుడు నీమనసులో నేనెందుకువుంటాను. కాలప్రభావంవలన మానవ మనసులుకూడ మారిపోయి చపలచిత్తములై పోతున్నాయి కదూమరి?. పారూ! ఎపుడూ నువ్వేనామనసులో మెదులుతూ వుంటావు. కనులుమూసినా, తెరచినా, చదువుతున్నా, పనిచేస్తున్నా, నీరూపమే నాస్మృతి పథంలో నీరూపమేకనిపిస్తోంది. అదేనన్ను, ఏంపనిచెయ్యనీయకుండా, కట్టిపడేస్తోంది. నేనేంచెయ్యగలను. 'నిన్నుమరచిపోదామన్నా, మరపురాకుండా వున్నాను. నీసుందర సుకుమారమయినరూపం నామనసులో స్థిరపడిపోయింది పారూ!.

నేను యింతవరకు ఎవరినీ ప్రేమించలేక పోయాను. ఎవరిచేత ప్రేమించబడలేదు.ఆనాడు నిన్ను చూడకపోతే నిన్ను కూడప్రేమించలేనేమో! ఏముహూర్తాన నిన్ను చూసానో, ఆరోజేనాహృదయంలో చెప్పరానిబాధ బయల్వెడలి, నాశరీరాన్ని దహించివేసింది. కాంతి పూజములవలె, ప్రకాశిస్తున్న, నీగుండ్రటికళ్లు నన్ను ఆకర్షించుకున్నాయి. పొంగసయిన నీముఖబింభం, నాహృదయానికి హత్తుకుపోయింది. నిన్నుచూస్తుంటే రోజులు క్షణంలో దొర్లిపోతాయి పారూ.!

ఈప్రపంచంలో ప్రేమ అనేమాట సకల చరాచర జీవకోటిలోనూ, ఎంతోకొంత కనిపిస్తునేవుంది. అదేసృష్టి రహస్యం. ప్రేమప్రభావం లేని పాషాణమే ఈప్రపంచంలో లేదు.

పారూ! తామరపువ్వును బోలిన నీముఖారవిందం నామనసులో అంతులేని ఆలోచనలకు తావుయిస్తోంది. మత్తునుకలిగించే నీనయనాలు, నాశరీరంలో ఆరని జ్వాలాగ్నిని రగిలిస్తోన్నాయి. సన్నని పలుచని నీసుకుమార సౌందర్యధరాలు నాలో ఏవోతెలియని వాంఛను రేపుతోన్నాయి. నిన్నుప్రేమించడానికి యివేకారణాలు కావు పారూ! అది నీమనసులోవున్న మంచి గుణం. ఎంతోజాలిగుండెనీది. నీలోవున్న ఈ మంచితనాన్నే నేనుప్రేమించాను. అందమైన నీమనసు చుట్టూ నాహృదయంచిక్కుకుపోయి, ఊపిరాడక గింజుకుపోతున్నాను. నన్ను ఈవిష

GLOBE TEX

నాణ్యమునకు ప్రసిద్ధిచెందినది.
మీరు బట్టలను ఖరీదు చేయునప్పుడు వాటిమీద
"గ్లోబ్ టెక్స్" మార్కు గమనించ ప్రార్థన.
టెక్స్‌టైల్ మిల్స్ కార్పొరేషన్
పి. బి. నెం 125. పోస్ట్ : : ఈరోడు (S. I.)

మపరిస్థితినుంచి తప్పించగలవారు, నీకు తప్ప యింకెవరికీ సాధ్యంకాదు.

నీకు ఎన్నోవిధాలుగా నాపవిత్ర ప్రేమను తెలియచేయాలనుకుని ఆఖరుకి, విఫలుడినయి నీచేతనే తిరస్కరింపబడ్డాను. నీవునన్ను అర్థంచేసుకునికూడ తిరస్కరించావు. 'నిన్ను ప్రేమించలేదు' అని నాముఖంపైననే అనేశావు. నన్ను, నమ్మించి, ఇంత మోసంచేస్తావని, నేను అనుకోలేకపోయాను పారూ! నీ తిరస్కారంతో, నీవుచేసిన మోసంతో నాహృదయం ముక్కలయిపోయింది. ఈజీవితంలో నిన్నుతప్ప ఎవరిని ప్రేమించగను. ఎవరినీ ప్రేమించలేను. పారూ! ఆనాడు నీవురాసినవుత్తరం కనుక నాకు అందకపోతే నేను ఎంతో అదృష్టవంతుడనయ్యేవాడను కానీ, పారూ, నువ్వుచాలా అపోహపడ్డావు. అయినా, నిన్ను ఎందుకు మోసంచేస్తాను. చిన్నప్పటినుండి, నిన్ను యింతకాలం నా గుండెల్లో పదిలంగాదాచుకుని, పూజించి, ప్రేమించినందుకు ఈనాడు నిన్నుమరచిపోవడమేనా, నాకు మిగిలినప్రతిఫలం?. నిన్ను మోసంచేసానని ఎలా భావించావు పారూ! నేనంత ధుర్మార్గుడిని కాదు. ఇంతకాలంనుంచి. యింతేనా నువ్వు నన్ను అర్థంచేసుకుంది.

పారూ!. నిన్ను నేను ఎపుడూ నిందించలేదే! కనీసం మాట అయినా అనలేదే! యిన్నాళ్ళ మవప్రేమకు ప్రతిఫలం, ఈనాడు నిన్నుమరచిపోవడమేనా! ఈనాడు నువ్వు నాకుయిచ్చేప్రతిఫలం?. నన్ను మరచిపోవడమే నీ అభిప్రాయమైతే అందుకు నేను ఏంచెయ్యగలను. ఈ జీవితాంతమూ, నీస్మృతిని తలుచుకుంటూ, నాలో నేను కృంగి, కృశించిపోవడమే ఆఖరుకి నేను చెయ్యగలిగింది? ఇక నాజీవితం ఇంతేపారూ!. గడచిన పోయినగాధను జ్ఞప్తికి తెచ్చుకుని, ఈ అభాగ్యునికోసం ఎదురుచూడకు పారూ! నీపవిత్రహృదయంలో శాశ్వతంగా నిద్రపోయే అదృష్టం నాకు లేకుండా పోయింది. నీప్రేమనుపొందలేని నేను ఎంత నిర్భాగ్యుడను?ఇక నీ హృదయంలో ఈ అభాగ్యుని ఎపుడూ తలంచకు. మొదటిలోనే నీవునన్నుతిరస్కరించినందుకు ఇక నీవు నన్నునమ్మవద్దు పారూ! నమ్మవద్దు. అఖరిసారిగా నీస్మృతిని తీసుకుని, శాశ్వతంగా ఈ లోకాన్ని విడచిపెట్టబోయే ఈఅభాగ్యునికోసం, ప్రేమపూర్వకంగా ఒక్కవేడి నిట్టూర్పువిడిస్తే అదే నా ఆత్మకుశాంతి! ఇక నన్ను క్షమించు పారూ! క్షమిస్తావుకదూ.

ఉత్తరం అంతా శాంతంగా చదివినపార్వతి కళ్ళనుంచి, కన్నీళ్ళు జలజలారాలాయి. ఆమె గొంతుక తీరని దుఃఖంతో పూడుకుపోయింది. గోపీ! నన్నుక్షమించు. రత్నంలాంటి నిన్నుప్రేమించలేక, నిన్ను నాఅవివేకంవలన దూరంచేసుకున్నాను. అందుకుశిక్ష యిపుడు ఒంటరిగా అనుభవిస్తున్నాను. గోపీ! అనుభవిస్తున్నాను. న్నుప్రత్యక్షంగా ప్రేమించలేక పోయినా, పరోక్షంగా నామనసులో నీరూపాన్ని ప్రతిష్ఠించుకుని ఆరాధిస్తోన్నాను. ఆనాడు చదువునే రోజులనుండి నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఇప్పుడు దుర్విధిప్రేరితనై తెలిసీ తెలియని అజ్ఞానంవలన పరుషంగా అనరానిమాటలతో నీమనస్సు నొప్పించి, అమృతంవంటి నీప్రేమను పోగొట్టుకున్నాను. గోపీ, నేను పాసిష్టిదాన్ని. నిన్నుపొందలేని నాకు ఈజీవితంలో నిష్కృతిలేదు. గోపీ! నిష్కృతిలేదు, నన్ను క్షమించుగోపీ! క్షమించవా గోపీ!.

ఆ వుత్తరాన్ని హృదయానికి బలంగా హత్తుకుని, భోరుమని గుండెలవిసిపోయే లాభోరున విలపించింది పార్వతి.